సాక్షి ఒడిశా

సోమవారం । 3 । మార్చి । 2025



ఆందోళన

కొరాపుట్‌లో పారామెడికల్ సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. డిమాండ్లు నెరవేర్చాలంటున్నారు. - 8లో▸



ముగిసిన ప్రతిష్ఠోత్సవం

బాలింకేశ్వర మందిర ప్రతిష్ఠోత్సవం ముగిసింది. రాయగడలో కార్యక్రమం జరిగింది. - 8లో▸



ఘనంగా వీల్‌చైర్ డే

జయపురంలో వీల్‌చైర్ డే నిర్వహించారు. పలు పోటీలు పెట్టారు. - 8లో▸

మంత్రి మండలి .. విస్తరణపై ఊహాగానం

- బడ్జెట్ సమావేశాల తర్వాతే అని సమాచారం
- కొలువులో ఖాళీ ఆరు పదవులు



భువనేశ్వర్: ఒకవైపు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతుండగా మరో వైపు మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. జాతీయ శాఖ అధ్యక్షుడు ఇటీవల పర్యటించడంతో ఈ ఉత్కంఠకు తెర పడుతుందని ఊహించారు. కానీ అది జరగలేదు. శాసన సభలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రి మండలి విస్తరణ పరిశీలించడం జరుగుతుందనే సంకేతాలు లభిస్తున్నాయి. ఈ వ్యవధిలో సంస్థాగత సర్దుబాట్లు, సవరణల కోసం జాతీయ శాఖ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు సమాచారం. వాస్తవానికి మోహన్ చరణ్ మాఝి కొలువులో మరో 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అతి త్వరలో వీటిని భర్తీ చేయాల్సి ఉంది. సంస్థాగత ఎన్నికలు ముగియడంతో ఖాళీ మంత్రి పదవుల భర్తీ పూర్తి చేయాలనే యోచనతో బీజేపీ రాష్ట్ర శాఖ సన్నాహాలు చేస్తుంది. విస్తరణ పురస్కరించుకుని ఎవరికి మంత్రి పదవి వరిస్తుందోనన్న ఉత్కంఠ బిగుసుకుని ఉంది. కొలువులో ఏ జిల్లాలకు ప్రాధాన్యత లభిస్తుందో మరి కొన్ని రోజుల్లో స్పష్టమవుతుంది.

సంస్థాగత ఎన్నికలు

బీజేపీ సంస్థాగత ఎన్నికలు అంచెలంచెలుగా జరుగుతున్నాయి. త్వరలో రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుంది. దీంతో పలు కార్పొరేషన్లు, బోర్డులు మరియు వివిధ కమిషన్లలో సభ్యుల నియామకం కోసం మార్గం సుగమం అవుతుంది. ఈ హోదాలు, పదవుల పట్ల పలు ఆసక్తితో ఆశావాదులు ఉవ్విళూరుతున్నారు. ఈ సన్నాహాలు పూర్తి కావడంతో మంత్రిత్వ శాఖల విస్తరణ సంకేతాలు కనిపిస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఇటీవల కాలంలో కేంద్ర నాయకత్వంతో తరచూ ఉన్నత స్థాయిలో సమావేశం కావడం కొత్త వారికి పదవుల వస్తాయని ఆశలు పుంజుకుంటున్నాయి. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ముఖ్యమంత్రి మోహన్ మాఝి, బీజేపీ కేంద్ర నాయకుల మధ్య చర్చలు జరుగుతున్నాయని పార్టీ వర్గాల నుంచి సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త శాఖల ఏర్పాటు, సభ్యులకు పదవుల కేటాయింపు ప్రామాణికాలపై పలు చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో తొలి సారి పగ్గాలు చేపట్టిన బీజేపీ ఏర్పాటు చేసిన కొలువులో గిరిజన, మహిళ, పశ్చిమ ఒడిశా ప్రాతినిధ్యం ప్రామాణికాలతో ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల్ని నియమించింది.

6 పదవులు ఖాళీ

శాసన సభలో 21 శాఖలతో మంత్రి మండలి ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో సహా మంత్రి వర్గంలో 15 మంది సభ్యులు ఉన్నారు. ఈ లెక్కన మరో 6 శాఖలకు మంత్రుల నియామకం జరగాల్సి ఉంది. తాజా మంత్రి మండలి విస్తరణ పురస్కరించుకుని ఈ స్థానాల్లో కొత్త ముఖాలకు అవకాశం లభించడం తథ్యం. ఆ ఆరుగురు సభ్యుల ఎంపిక ప్రామాణికతపై అంతా బిక్కు బిక్కుమంటున్నారు. జిల్లా వారీ ప్రాతినిధ్యంలో గంజాం జిల్లా ముందంజలో ఉంది. ఈ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా గంజాం జిల్లా నుంచి అతి తక్కువగా ఒకరికి మంత్రి పదవి లభించడం తథ్యమని భావిస్తున్నారు. వెనుకబడిన, మారు మూల ప్రాంతాల ఉనికిని బలపరిచే దిశలో ప్రాంతీయ ప్రాధాన్యత ప్రామాణికం కావచ్చనే ఊహాగానాలు బలం పుంజుకుంటున్నాయి. ఈ క్రమంలో కొరాపుట్‌లో కాంగ్రెస్ ప్రాబల్యానికి కళ్లెం వేసేందుకు మంత్రి వర్గంలో కొరాపుట్ జిల్లాకు ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమతుల్యత నిర్వహణలో భాగంగా మంత్రి వర్గంలో ఖుర్దా లేదా పూరీ జిల్లా సభ్యులకు మంత్రి పదవి వరించే అవకాశం లేకపోలేదు.

బాలాసోర్ నుంచి యువతకు అవకాశం

ప్రస్తుత మంత్రి మండలిలో బాలాసోర్ జిల్లా ప్రాతినిధ్యం ఏమీ లేదు. ఈ శూన్యత తొలగించే దిశలో యువతకు పట్టం గట్టి ఉభయతారక ప్రయోజనం ప్రాతిపదికకు పదును పెడుతున్నట్లు సమాచారం. ప్రాంతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న పశ్చిమ ఒడిశా నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం ఖరారు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికలు

రాష్ట్రంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మండలి విస్తరణ పురస్కరించుకుని అభ్యర్థుల ఎంపిక అత్యంత కీలకం. ఈ కీలక కార్యాచరణ పట్ల పార్టీ అగ్రనేతలు దృష్టి సారించారు.

పదవులు కోల్పోయే ముప్పు

మంత్రి మండలి విస్తరణ పురస్కరించుకుని కొందరు పదవులు కోల్పోయే ముప్పు పొంచి ఉంది. వివిధ శాఖల పని తీరుని పరిగణనలోకి తీసుకున్న తర్వాత మంత్రి మండలి విస్తరణకు మార్గం సుగమం చేసే యోచనలో పార్టీ అధిష్టానం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో బడ్జెటు నిధుల కేటాయింపుల వ్యయం స్థితిగతుల్ని ముఖ్యమంత్రి సమీక్షించిన అనుబంధ మార్గదర్శకాలు జారీ చేసిన విషయం విదితమే. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి గత ఏడాది కంటే అధికంగా నిధుల్ని వెచ్చించాలనే ఆంక్ష విధించారు. ఈ ఆంక్షని విజయవంతంగా అధిగమించే వారు ముప్పు నుంచి బయట పడే అవకాశం ఉంటుంది. ఇటీవల కాలంలో కొంత మంది మంత్రులు పార్టీ వైఖరికి భిన్నంగా పలు సందర్భాల్లో పెదవి జారిన దాఖలాలు బీజేపీ శిబిరంలో కలకలం రేపాయి. ఈ వర్గీయులపై వేటు పడే అవకాశం పొంచి ఉంది. ఈ లెక్కన మోహన్ చరణ్ మాఝి కొలువులో కొత్తగా 6 మంది పైబడి మంత్రులుగా ప్రత్యక్షం అయ్యే అవకాశం ఉంది. పలువురు మంత్రులు బహుళ శాఖల బాధ్యతలు వహిస్తున్నారు. వీరిపై ఒత్తిడి నివారించే దిశలో మంత్రి వర్గ విస్తరణ కార్యాచరణ మెరుగులు దిద్దుకుంటుంది.

8 పార్లమెంటరీ నియోజక వర్గాలకు ప్రాధాన్యత

కటక్, భువనేశ్వర్, సుందరగఢ్, కలహండి, బాలేశ్వర్, కేంద్రాపడా, కొరాపుట్, కంధమల్ పార్లమెంటరీ నియోజక వర్గాల నుంచి మోహన్ చరణ్ మాఝి కొలువులో ప్రాతినిధ్యం శూన్యంగా కొనసాగుతుంది. కొత్త కొలువులో ఈ ప్రాంతీయులకు ప్రాధాన్యత లభిస్తుంది. ప్రాంతాల వారీగా, శాఖల పరంగా త్వరలో కొత్త ముఖాలతో కొలువు తళుక్కమంటుంది.

న్యూస్‌రీల్

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టయిన నిందితులు

రాయగడ: చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సదరు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో జి.బంగారు, ఎస్.బాబు, జి.చందులు ఉన్నట్లు ఐఐసీ కె.కె.బి.కె.కుహారో తెలిపారు. గత నెల 25వ తేదీన కొరాపుట్ జిల్లా బంధుగాం పంచాయతీ గులుగుడ గ్రామానికి చెందిన సదారాం కొలక వ్యాపార నిమిత్తం రాయగడకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక బస్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురు చూశార. బస్సు రావడంతో బస్సు ఎక్కే సమయంలో తన జేబులోని పర్సు పోయినట్లు గుర్తించి వెంటనే సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు దొంగలను గుర్తించి అరెస్టు చేశారు.

నడకపై అవగాహన



నడకపై అవగాహన కల్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడకపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్షులు జేకే ప్రధాన్, సాయిప్రియ మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.అరుణల నేతృత్వంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా పుర వీధుల్లో బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ర్యాలీని నిర్వహించారు. రోజూ వ్యాయాయం చేయడం ఎంతో అవసరమని, నడక ఆరోగ్యానికి మేలుచేస్తుందన్నారు. దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలని నినాదాలు చేశారు. ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే అందుకు వ్యాయామం ఎంతో అవసరమని క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్ కుమార్ అన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



గోపాల జెన్నా మృతదేహం

పర్లాకిమిడి: విశాఖపట్నం నుంచి పర్లాకిమిడి వస్తున్న ఫాస్ట్ ప్యాసింజరు రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పర్లాకిమిడి 11వ వార్డు డెప్ప ఒడియా వీధికి చెందిన మేస్త్రి గోపాల జెన్నా (50) ఆదివారం ఉదయం పర్లాకిమిడి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడడంతో ప్రాణాలు కోల్పోయినట్టు జీఆర్పీ ఎస్సై త్రినాథ్ సామల్ తెలిపారు. గతంలో కూడా రైలు నుంచి జారిపిన జెన్నా మతిస్థిమితం కోల్పోయి తన మేస్త్రి వృత్తిని కూడా మానేసి ఖాళీగా తిరుగుతుండేవాడని కుమారుడు 'సాక్షి'తో అన్నారు. జెన్నా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

విషం తాగి రైతు ఆత్మహత్య



పొలంలో సుధీర్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో గిరకాన్‌పల్లి పంచాయతీ ఎంవీ 57 గ్రామానికి చెందిన సుధీర్ హల్దార్ (55) ఇంటికి 500 మీటర్ల దూరంలో ఆదివారం ఉదయం విగత జీవిగా కనిపించారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుధీర్ తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడకో వెళ్లి ఉంటాడని అంతా అనుకున్నారు. కానీ ఆదివారం తన పొలంలోనే విషం తాగి చనిపోయి కనిపించాడు. దీంతో వెంటనే భార్యకు,కుమారులకు సమాచారం అందజేశారు. వారు వెళ్లి చూసే సరికి మృతదేహం పక్కన పురుగు మందు సీసా కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందజేశారు. ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుధీర్ వ్యవసాయం చేస్తుండేవాడని, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయని విచారణలో తెలిసింది. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం



విద్యార్థిని రింకి సరకకు ఆర్థికసాయం పత్రాలను అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో

రాయగడ: నిరుపేద ఆదివాసీ విద్యార్థిని చదువు కోసం జిల్లా యంత్రాంగం ఆర్థిక సహకారాన్ని అందించింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో రెడ్ క్రాస్ నిధుల నుంచి విద్యార్థికి 30 వేల రూపాయలను అందించారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని చంద్రపూర్ సమితి పరిధి హిమబ్రాస్ గ్రామంలో నివసిస్తున్న రింకి సరక తల్లిదండ్రులు ఇదివరకే చనిపాయారు. ఉన్న తన అక్క కర్ణాటక రాష్ట్రంలో ఉపాధి కోసం వెళ్లింది. అక్క పంపించిన కొంత డబ్బులదో పదో తరగతి వరకు చదువుకున్న రింకి అనంతరం పైచదువు కోసం ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బంది పడుతుండేది. కొంతమంది గ్రామస్తులు ఆమె దీన పరిస్థితిని జిల్లా యంత్రాంగం దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ పట్వారి రూ. 30 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. విద్యార్థిని రింకి కలెక్టర్ కార్యాలయానికి శనివారం రాగా.. ఆమెకు జిల్లా అదనపు కలక్టర్ కుహారో ఆర్థిక సహాయానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. జిల్లా యంత్రాంగం ఎంతో ఉదారతతో తనకు ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందని.. నర్సింగ్ కోర్సులో చేరి చదువు పూర్తయిన తరువాత తమ సేవలను అందిస్తానని రింకి చెప్పారు. జిల్లా యంత్రాంగానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బిడ్డ జననం.. తండ్రి మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



మృతి చెందిన హనీఫ్ ఖాన్



ప్రమాదానికి కారణం అయిన ట్రక్



క్షత గాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొరాపుట్: బిడ్డ పుట్టిన ఆనందం అనుభవించేలోపే తండ్రి రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కొరాపుట్ జిల్లా నందపూర్‌కి చెందిన హనీఫ్ ఖాన్ (40) సతీమణి నందపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ప్రసవించారు. ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరగడంతో వైద్యుల సూచన మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకి బాలింత, శిశువుని తరలించారు. వారి అంబులెన్స్‌వెనుకే వేరే కారులో హనీఫ్ వెళ్లారు. ఇదే సమయంలో కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఉమెన్స్ కాలేజీ సమీపంలో ఒక ట్రక్‌ను హనీఫ్ ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఆయన తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వైద్య కళాశాలకు తీసుకెళ్లారు. అప్పటికే హనీఫ్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతి చెందిన తండ్రి, అప్పుడే పుట్టిన నవ జాత శిశువు ఒకే ఆస్పత్రిలో వేర్వేరు వార్డుల్లో ఉండడం విషాదం కలిగించింది.

60 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి బస్తాలు, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఉదయం కద్బల్ కూడలి వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. ఈ సమయంలో తెలంగాణా ఆటోలో అక్రమంగా గంజాయని తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే ఆటోను తనిఖీ చేయగా అందులో 60 కేజీల గంజాయి పట్టుబడింది. బలిమెల వైపు నుంచి అతి వేగంగా వచ్చిన ఆటోను తనిఖీ చేయగా.. అందులో మూడు బస్తాల్లో గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ఇద్దరి అరెస్టు చేసి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితులిద్దరూ తెలంగాణా రాష్ట్రానికి చెందిన మెటపల్లి నిస్సంత, దుపత్తి మోహన్‌గా గుర్తించారు. వీరు చిత్రకొండ సమితిలో గంజాయి కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా పట్టుబడినట్టు పోలీసులు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని జిల్లా ఎక్సైజ్ అధికారి బింబేంద్ర పండా తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ ఆరు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. పెట్రోలింగ్‌లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అశేష్ కుమార్ నాయిక్, జ్ఞానరంజన్ సాహు ఉన్నారు.

వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం



రాజవీధి వద్ద ఫిట్ ఇండియా ర్యాలీలో అధికారులు, విద్యార్థులు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

- పర్లాకిమిడిలో 'ఫిట్ ఇండియా'సైకిల్ ర్యాలీ

పర్లాకిమిడి: రోజూ అరగంట సైకిల్ తొక్కడం, యోగా, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక పాలనాధికారి నివాసగృహం వద్ద ఆదివారం ఉదయం ఫిట్ ఇండియాలో భాగంగా 'ఫిట్‌నెస్‌కి డోస్..ప్రతి రోజూ ఉదయం అరగంట'అనే కార్యక్రమాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ జెండాఊపి ప్రారంభించారు. ర్యాలీలో అధికారులు ఏడీఎం రాజేంద్ర మింజ్, జిల్లా పరిషత్తు అసిస్టెంటు ఇంజినీరు వెంకట్రావు అచారి, జిల్లా మిషన్ శక్తి అధికారి టిమోన్ బోరా, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా శారీరక క్రీడాధికారి సురేంద్ర కుమార్ పాత్రో, డీపీఆర్‌వో ప్రదీప్ గురుమయి, అధికసంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీ స్టేట్‌బ్యాంకు, హైస్కూల్ జంక్షన్, ప్యాలస్ వీధి వరకూ కొనసాగింది.

కొరాపుట్ జిల్లాకు క్రూజ్ షిప్ సేవలు



ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా



కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్



క్రూజ్ షిప్

కొరాపుట్: పర్యాటక రంగంలో అగ్రస్థానంలో ఉన్న కొరాపుట్ జిల్లాకు మరో మణి హారం రానుంది. ఈ జిల్లాలో కొలాబ్ డ్యాంలో క్రూజ్ షిప్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలు ప్రకటించారు. అక్కడ క్రూజ్ షిప్ సేవల కోసం జెట్టీ నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. అందుకోసం రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. పర్యాటక రంగంలో కొరాపుట్ జిల్లాను ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మరోవైపు కొరాపుట్ కలెక్టర్ వీ.కీర్తి వాసన్ కూడా ఆదివారం మీడియా ముందు ఈ విషయం ధ్రువీకరించారు. ఇది వరకే క్రూజ్ షిప్ కోసం నిపుణులు కొలాబ్ డ్యాం లో పరిశీలనలు పూర్తి చేశారు. అందుకోసం ప్రథమ సర్వే పూర్తయిందని కలెక్టర్ ప్రకటించారు.

గండాహతి, జగన్నాథ మందిర పునర్నిర్మాణానికి నిధులు



గండాహతి జలపాతం



పర్లాకిమిడిలో జగన్నాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం



మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గండాహతి జలపాతాలు, పర్లాకిమిడిలో జగన్నాథ మందిరం పునర్నిర్మాణం కోసం రాష్ట్ర టూరిజం శాఖ రూ.160 లక్షలు కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు తెలిపారు. గండాహతి జలపాతాల అభివృద్ధికి రూ.కోటి, శ్రీజగన్నాథ మందిర నిర్మాణానికి రూ.60లక్షల నిధులు కేటాయించినట్టు రాష్ట్ర టూరిజం శాఖ ప్రత్యేక కార్యదర్శి బాలముకుంద భుయ్యాన్ ఈ మేరకు ఈనెల 21న ప్రభుత్వలేఖను విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు చొరవతో గజపతి జిల్లాలో పర్యాటక కేంద్రాలు ఇకపై అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా అంతర్జాతీయ వీల్‌చైర్ డే


జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మహంతి

జయపురం: కలెక్టర్ సూచన మేరకు జయపురం మున్సిపాలిటీలో అంతర్జాతీయ వీల్‌చైర్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని చైర్మన్ మహంతి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో 67 మంది దివ్యాంగులు వీల్‌చైర్లతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి వీల్‌చైర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రసాద్ పారిచ ప్రథమ స్థానంలో నిలవగా, భగత్ ఘొడ ద్వితీయ, పురుషోత్తమ భొలొ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీల్‌చైర్ రన్నింగ్ విజేతలకు చైర్మన్ మహంతి బహుమతులతో సత్కరించారు. బహుమతుల ప్రధాన ఉత్సవంలో నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ దివ్యాంగులకు మనో ధైర్యాన్ని కలిగించేందుకు వీల్‌చైర్ దినాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.


పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో వీల్‌చైర్‌లో పాల్గొన్న దివ్యాంగులు


వీల్‌చైర్ పోటీలో పాల్గొన్న దివ్యాంగులు

క్లుప్తంగా

రాష్ట్రంలో పెరుగుతున్న వేసవి తాపం

- 10 ప్రాంతాల్లో అత్యంత వేడిమి

భువనేశ్వర్: రాష్ట్రంలో వేసవి తాపం పెరుగుతోంది. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉంటుంది. రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఆదివారం రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో 37 డిగ్రీల సెల్సియస్ పైబడి ఉష్ణోగ్రత నమోదైంది. బౌధ్ ప్రాంతంలో అత్యధికంగా 38.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం అంచనా వేసింది. అయితే, ఈ వారం ప్రస్తుత వాతావరణ పరిస్థితులు స్థిరంగా కొనసాగుతాయని సంకేతం జారీ చేసింది.

రానున్న 4, 5 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత, రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలో పెద్ద మార్పు ఉండదని ఐఎండీ తెలిపింది.

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)	ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
బౌధ్	38.2	జాజ్‌పూర్	37.2
బొలంగీర్	38.1	బరిపద	37.0
అంగుల్	37.9	సోన్‌పూర్	37.0
టిట్లాగఢ్	37.6	భవానీపట్న	37.0
భద్రక్	37.5	భువనేశ్వర్	36.1
ఝార్సుగుడ	37.5	కటక్	34.2

రైలు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి


బాలకృష్ణ మృతదేహం

పాతపట్నం: రైలు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పాతపట్నం మండలం రంకిణి పంచాయతీ బగంతర గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జీబ బాలకృష్ణ(32)ను ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పాతపట్నం మహేంద్రతనయా నది బ్రిడ్జి సమీపంలో పూరి నుంచి గుణుపూర్ వెళుతున్న రైలు ఢీకొట్టింది. వెంటనే రైలు నిలిపివేసి క్షతగాత్రుడి వద్దకు రైల్వే సిబ్బంది వెళ్లగా ప్రాణం ఉందని తెలుసుకుని, వెంటనే అదే రైలులో పర్లాకిమిడి (ఒడిశా) తీసుకెళ్లారు. స్టేషన్‌కు చేరుకోగానే బాలకృష్ణ మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వే సిబ్బంది పలాస రైల్వే ఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించామని రైల్వే అధికారులు తెలిపారు. బాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య జీబ భవాణి, రెండేళ్ల బాబు వర్ధన్ ఉన్నారు. రైలు వస్తున్న సమయంలో ట్రాక్‌పైకి బాలకృష్ణ ఎందుకు వెళ్లాడో తెలియాల్సి ఉంది.

సంతానం కలగలేదన్న మనస్తాపంతో..

- యువకుడు బలవన్మరణం
- డోకులపాడులో విషాదం


వడ్డి రాజు (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడు గ్రామానికి చెందిన వడ్డి రాజు(32) సంతానం కలగలేదన్న మనస్తాపంతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాజుకి 12 ఏళ్ల క్రితం రాజ్యంతో వివాహం జరిగింది. పిల్లలు లేకపోవడంతో మానసికంగా కుంగిపోతూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఎప్పటిలాగే కూలీ పనులు చేసుకుంటూ ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి తన గదిలో పడుకునేందుకు వెళ్లాడు. కుటుంబ సభ్యులంతా నిద్రలో ఉండగా ఇంట్లో ఉన్న సూపర్ వాస్మిన్-33 నూనె తాగేశాడు. చావుబతుకులతో కొట్టుమిట్టాడుతున్న రాజును కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి శవపంచనామా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నిహార్ తెలిపారు.

ఏపీబీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అశోక్



శ్రీకాకుళం న్యూకాలనీ: బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మెట్ట అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట వేశారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా నాలుగేళ్ల నుంచి అశోక్‌కుమార్ విశేష సేవలు అందిస్తున్నారు. ఈయన హయాంలో శ్రీకాకుళం వేదికగా అండర్-19, అండర్-17 విభాగాల్లో రెండు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలను విజయవంతంగా నిర్వహించి ప్రసంశలు అందుకున్నారు. అశోక్ ఎన్నిక పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘ చైర్మన్ ఆర్.రాజేంద్రన్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, అధ్యక్షుడు కె.సాగర్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, శైలానీ, ప్రసాద్, రత్నాజీ హర్షం వ్యక్తంచేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


సమావేశంలో మంత్రి గోకులనందతో అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంపద శాఖ మంత్రి గోకుల్ నంద మల్లిక్, నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్ర మాఝిలు సమీక్ష సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం అధికారుల నిరంతర పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ రహదారి ప్రణాళిక పనుల గురించి ఆరా తీశారు. ప్రధాన మంత్రి గృహ యోజన, అంత్యోదయ గృహ ప్రణాళిక లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. మత్స్య సంపదతో పాటు, కోడి గుడ్ల ఉత్పత్తిలో జిల్లా స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో డాల్మియా, అంబుజా సంస్థల ద్వారా రెండు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. సుభద్ర పథకం అమలుపై ప్రశ్నించారు. సమావేశంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కమి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి బాదల్ కుమార్ మహంతి, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

బోడ జాతర పీఠం ప్రతిష్ఠ


అమ్మవారి పీఠాన్ని ప్రతిష్ఠస్తు ఎంపీ బోలభద్ర మాఝి, అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట కన్యమాఝి చెరువు వద్ద 8వ తేదీన బోడ జాతర దేవతామూర్తుల కోసం ఓ పీఠంను ఏర్పాటు చేశారు. ఇకపై రెండేళ్లకోసారి ఇక్కడే జాతర జరుపుతామని అమ్మవారి ప్రదేశంగా పీఠం చేశారు. ఆదివారం ఎంపీ బోలభద్ర మాఝి ప్రతిష్ట చేశారు. ఇక్కడకు దేవతామూర్తులను శనివారం తెచ్చారు. సోమ, మంగళవారాల్లో మాళిమ మందిరం వద్ద జతార ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కామి, సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జాతర కమిటీ సభ్యులు, ప్రపుల్ల కుమార్ పండా, ఇతర సభ్యులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి మినీ మారథాన్


సిమిలిపాల్ మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన మినీ మారథాన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం పాల్గొన్నారు. మయూర్‌భంజ్ జిల్లా రామతీర్థ ప్రాంతం నుంచి 10 కిలోమీటర్ల పొడవున నిర్వహించిన మినీ మారథాన్‌ను ముఖ్యమంత్రి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో 900 మంది పైబడి యువతీ యువకులు పాల్గొన్నారు. – భువనేశ్వర్

బంగాళదుంపల పంట పరిశీలన


బంగాళదుంపల సాగును పరిశీలిస్తున్న డైరెక్టర్ కల్యాణ్

రాయగడ: సదరు సమితిలో గల కుంబికోటలో రాష్ట్ర ఉద్యానవన విభాగం డైరెక్టర్ నిఖిల్ పవన్ కల్యాణ్ ఆదివారం పర్యటించారు. కుంబికోటలో అగ్రగామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేస్తున్న బంగాళదుంపల పంటను పరిశీలించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగవుతున్న బంగాళదుంపల సాగు చేస్తున్న రైతులకు మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. మెలకువలు అందజేస్తే ఈ సాగులో ఆసక్తి కనబరుస్తారన్నారు.

రబీ సీజన్‌లో కూడా రైతులు బంగాళదుంపల సాగు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రోత్సాహం, సూచనలు సకాలంలో రైతులకు అందుతాయని వివరించారు. వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన బంగాళదుంపల సాగుతో రైతులు ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతోపాటు వారి కష్టానికి తగిన ఫలితం దక్కుతుందన్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూమి సారం కోల్పోవడంతో పాటు దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపాలన్నారు. అగ్రగామి సంస్థకు చెందిన ప్రమోద్ కుమార్ పండా, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కె.సూర్యారావుకు భార్యావియోగం


కె.పద్మ (ఫైల్)

పర్లాకిమిడి: మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు సతీమణి కె.పద్మ (56) ఆదివారం రాణిపేట గ్రామంలో స్వగృహంలో మృతి చెందారు. గత ఆరునెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్టు వారి బంధువులు తెలియజేశారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి అంత్యక్రియలు ఆదివారం రాణిపేటలో జరిగాయి. ఈ సందర్భంగా బీజేడీ ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీ రాజు, బీజేడీ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ప్రభుత్వ ఉద్యోగి ఔదార్యం

- 73సార్లు రక్తదానం


రక్తదానం చేస్తున్న రాం పండా

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రూరల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి రాం పండా 73వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఒక శిశువుకి ఆదివారం అత్యవసరంగా రక్తం అవసరమైంది. సంబంధిత కుటుంబీకులు రక్తదానం చేసే వారి కోసం వాకబు చేశారు. ఆస్పత్రికి సమీపంలో ఉన్న ఆర్‌డీ కార్యాలయానికి ఈ సమాచారం వచ్చింది. విషయం తెలుసుకున్న రాం పండా వెంటనే ఆస్పత్రికి వెళ్లి రక్తదానం శిశువుకు ప్రాణభిక్ష పెట్టారు.

మొక్కల పంపిణీ


మొక్కలతో హాస్పిటల్ సిబ్బంది

జయపురం: కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్ జయపురం ఫూల్‌బెడలో హాస్పిటల్ సిబ్బంది వృక్ష దాన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎం.ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్, హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది 60కి పైగా మొక్కలు పంపిణీ చేశారు. ఔషధ మొక్కలతో పాటు ఇండోర్ మొక్కలు పంచారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా వైద్యాధికారి దిలీప్ కుమార్ బిశ్వాల్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్ బెహర, అరవింద నేపక్, లక్ష్మీకాంత పాత్రో, పూజా బొహిదార్, అంకిత నాయక్, హాస్పిటల్ మేనేజర్ రూపసి మధుమిత నాయక్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆందోళన శిబిరంలో ప్రదీప్ మఝి, మున్నా త్రిపాఠిలు

పారా మెడికల్ సిబ్బంది ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డాక్టర్ లిఫికా మఝి

- పలువర్గాలు మద్దతు

కొరాపుట్: సమస్యలు పరిష్కరించాలని పారా మెడికల్ సిబ్బంది కొద్ది కాలంగా ఆందోళన చేస్తున్నారు. వీరికి వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఆదివారం నబరంగ్‌పూర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో చేపడుతున్న ఆందోళన శిబిరాన్ని పలువురు ప్రముఖులు సందర్శించారు. ముందస్తు హెచ్చరికలు లేకుండా 35 మంది పారా మెడికల్ సిబ్బందిని అధికారులు తొలగించారంటూ గత నెల రోజులుగా కుటుంబాలతో ఆందోళన చేస్తున్నారు. శిబిరాన్ని బీజేడీ పార్టీకి చెందిన మాజీ ఎంపీ ప్రదీప్ మఝి, డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠిలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా పరిషత్ సభ్యురాలు డాక్టర్ లిఫికా మఝి ఆందోళన కారులతో మాట్లాడారు.

ధాన్యం కొనుగోలును అడ్డుకుంటే చర్యలు


పర్లాకిమిడి ఆర్‌ఎంసీ మండీల వద్దకు ధాన్యం తీసుకువస్తున్న రైతులు


గజపతి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దిగాలుగా ఉన్న మహిళా రైతు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయకపోవడంతో కాశీనగర్ బ్లాక్ హద్దుబంగి, ఏడోమైలు (గుసాని) వద్ద రైతులు అనేకసార్లు ధర్నాలు రస్తారోకోలు చేపట్టారు. గజపతి జిల్లాలో మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు డబ్బులు డిపాజిట్ చేయలేయమని చేతులెత్తేయడంతో జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టారు. గజపతి జిల్లా కలెక్టర్ గంజాం కలెక్టర్‌తో మాట్లాడి అస్కా, కవిసూర్యనగర్, ధరాకోట్, ఖల్లికోట్, సన్నఖెముండి, జగన్నాథప్రసాద్, సురడా వంటి పదకొండు మంది మిల్లరు గజపతి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందుకు రావడంతో... రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ జీఓను జారీ చేసింది. గజపతి జిల్లాలో రైతులు వద్ద ధాన్యం కొనుగోలుకు గంజాం మిల్లర్లను ఒకవేళ గజపతి మిల్లర్లు అడ్డుకుంటే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బిజయ కుమార్‌దాస్ ఆదేశాలు జారీ చేశారు. గంజాం మిల్లర్లు 11 మంది ముందుకు వచ్చినట్టు సబ్ కలెక్టర్ అనుప్‌పండా తెలియజేశారు. మొత్తం రెండో ఫేజులో ఏడు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యం చేసుకోగా.. ఇప్పటికే గంజాం మిల్లర్లు ఆరు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు డబ్బులు డిపాజిట్ చేసినట్టు సబ్ కలెక్టర్ తెలియజేశారు. గత రెండు రోజుల్లో పర్లాకిమిడి పరిసర మండీల వద్ద రైతులు ధాన్యం నాణ్యత పరీక్షలు వద్ద క్యూ కట్టారు. శనివారం వరకు జిల్లాలో 70 వేల క్వింటాళ్ల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు.

కదమగుడలో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బలిగాం పంచాయతీ కదమగుడలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఇంటిలో ఉన్న 5 ధాన్యం బస్తాల బియ్యంతోపాటు దుస్తులు, సామగ్రి కాలిపోయాయి. గ్రామంలోని కనక గౌడ ఇంటి పెరటి వైపున మొక్కజొన్న తోట ఉంది. దానికి ఎవరో నిప్పు అంటించారు. గాలి వేయటం వలన సమీపంలో ఉన్న కనక గౌడ ఇంటికి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవటం వలన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు ఎగిసిపడటంతో వెంటనే బొయిపరిగుడ అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. గౌడ భర్త ఆంధ్రప్రదేశ్‌కు వలస కార్మికుడిగా వెళ్లారు. ఆ ఇంటిలో కనక గౌడ, 8 ఏళ్ల కుమారునితో ఉంటుంది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో కనక గౌడ కుమారుడుని కూలి పనికి తీసుకువెళ్లిందని సమాచారం. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కనక గౌడ కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులకు గ్రామస్తులు కోరారు.

ముగిసిన బాలింకేశ్వర మందిర ప్రతిష్ఠోత్సవం


అన్నప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

రాయగడ: స్థానిక పీహెచ్‌డీ వద్ద గల అత్యంత పురాతన బాలింకేశ్వర మందిరం పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా నూతనంగా నిర్మించిన ఆలయ ప్రతిష్ఠతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం ఆలయ శిఖర త్రిశూల స్థాపన, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ, సూర్య మందిరంలో పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. హరేరామ హరేకృష్ణ భజన కీర్తనలను భక్తులు ఆలపించారు.


శిఖర త్రిశూల స్థాపనకు తీసుకెళ్తున్న భక్తులు


విగ్రహ మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం


నవగ్రహాల ప్రతిష్ఠ


భజన కీర్తనలు ఆలపిస్తూ..

క్లుప్తంగా

ధాన్యం కుప్పలు దగ్ధం



పెదమానాపురంలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దుద్ది రమణ, చుక్క రాము, సబ్బి మంగమ్మ, చిల్ల ఈసు, తదితరులకు చెందిన ధాన్యం కుప్పలు దగ్ధమయ్యాయి. వెంటనే గజపతినగరం ఫైర్‌స్టేషన్‌కు గ్రామస్తులు సమాచారం అందించగా వారు వచ్చి మంటలు మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం జరగలేదని గ్రామపెద్ద రామసత్యం చెప్పారు.సంవత్సరం అంతా తినడానికి ఉంచుకున్న తిండి గింజలు కాలి బూడిదయ్యాయని పేద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సతివాడ వైపు ఏనుగుల పయనం



సతివాడ సమీపంలో మొక్కజొన్న పంటలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలో ఏనుగుల బెడద తీవ్రమైంది. ఆదివారం భామిని మండలంలోని సతివాడ సమీపంలో మొక్కజొన్న తోటలను తినివేస్తూ ఏనుగుల గుంపు పయనమైంది. పాత ఘనసర సమీపంలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు తివ్వాకొండల వైపు దారిమళ్లినట్లు ఫారెస్టు అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం మొక్కజొన్న పొత్తులు చేతికి అందే సమయంలో తోటలపై ఏనుగులు దాడి చేసి తినివేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగులను పూర్తి స్థాయిలో దారి మళ్లించి కాపాడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వైద్యరంగంలో ఎనస్థీషియాదే ప్రధాన పాత్ర



సదస్సులో పాల్గొన్న వైద్యులు

నెల్లిమర్ల: వైద్య రంగంలో ఎనస్థీసియాదే ప్రధాన పాత్ర అని ఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయనగరం మిమ్స్ వైద్య కళాశాలలో న్యూరో అనస్థీషియా సీఎంఈ సదస్సును ఆదివారం నిర్వహించారు. నేషనల్ ఐఎస్ఏ, విజయనగరం సిటీ బ్రాంచ్ సహకారంతో ఈ సదస్సు నిర్వహించగా సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల అనస్థీషియా విభాగం ఆచార్యులు కె వేంకటేశ్వరరావు మాట్లాడుతూ మిమ్స్ మెడికల్ కళాశాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా సదస్సు నిర్వహించామన్నారు. ఈ సీఎంఈ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మత్తువైద్యులకు ఎంతో ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. వైద్యరంగంలో ప్రధానంగా అనస్థీషియాకు సంబంధించి నూతన ఆవిష్కరణలను డాక్టర్ రాకేష్, డాక్టర్ మీనాక్షి సుందరం , డాక్టర్ విష్ణు మహేష్ వంటి ప్రముఖులు తెలియజేసినట్లు చెప్పారు.

సాయి శర్వాణీ కాలనీలో చోరీ

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి సమీపంలో గల సాయిశర్వాణీ కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగింది. మాజీ కౌన్సిలర్ పిల్లా రామారావు ఇంట్లో నగదు, ఇంటి నిర్మాణ సామగ్రిని దొంగతనం చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి వద్ద ఉన్న సీసీటీవీకి గోనె సంచి కప్పి ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై ఏఎస్సై బీవీ రమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.మూడు డ్రిల్లింగ్ మెషీన్లు, కొంత నగదు పోయినట్లు అనుకుంటున్నా ఇంటి యజమాని విజయవాడ వెళ్లడం వల్ల పూర్తి వివరాలు తెలియరాలేదు. ఆయన వచ్చిన తరువాత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసే అవకాశముందని ఏఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్టు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని రెండు చోట్ల పేకాట స్థావరాలపై దాడులు చేసి 9 మందిని అదుపులోకి తీసుకుని రూ.4,420లు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై గోవింద తెలిపారు. పట్టణంలోని బుగత వీధిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.1020, రామాపురం కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.3,400లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం పార్వతీపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచనున్నట్లు తెలిపారు.

ఆదర్శంగా చదువుకుందాం..రా..!



మెరకముడిదాం మండలం గర్భాం ఆదర్శపాఠశాల



లక్కవరపుకోట: కొత్తవలస ఆదర్శపాఠశాల

- మోడల్‌స్కూల్స్‌లో ప్రవేశాలకు ఆహ్వానం
- ఉమ్మడి జిల్లాలో 16 పాఠశాల్లో దరఖాస్తుల స్వీకరణ
- 1600 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం

మెరకముడిదాం/లక్కవరపుకోట: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను చేరువచేయాలనే సంకల్పంతో 2009వ సంవత్సరంలో ఏపీ మోడల్ స్కూల్స్ పేరుతో పాఠశాలలను ప్రారంభించారు. ఆయన సత్సంకల్పంతో ప్రారంభించిన ఈ మోడల్ స్కూల్స్ నేడు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాయి. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఏపీ మోడల్ పాఠశాలల్లో ఇంగ్లీష్ భోధన, అలాగే 9 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరం వరకూ ఈ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు పాఠశాలల్లోనే వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న 16 ఆదర్శ పాఠశాలల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 24 నుంచి మార్చి 31 వరకూ అర్హులైనవారు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని ఆధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్, నెట్‌బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లించిన తరువాత జనరల్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారం గా వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్, ఏపీఎంఎస్.ఏపీజీవోవీ.ఇం అడ్రస్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కులాల వారీగా పరీక్ష రుసుం

ఓసీ, బీసీ వారికి రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చెల్లించాలి. ప్రవేశపరీక్షలో ఓసీ, బీసీ విద్యార్థులకు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 30 రావాలి. ప్రతిభ, మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఏప్రిల్ 20 వతేదీన పాఠశాలకు సంబంధించిన ప్రవేశపరీక్ష ఉంటుంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యాలయాల్లో చదువుకున్న విద్యార్థులు కూడా ఈ పాఠశాలల్లో చేరేందుకు అర్హులు.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు	
మెరకముడిదాం మండలం	గర్భాం
దత్తిరాజేరు మండలం	షికారుగంజి
నెల్లిమర్ల మండలం	సతివాడ
డెంకాడ మండలం	అక్కివరం
విజయనగరం మండలం	అయ్యప్పనగర్
భోగాపురం మండలం	దల్లిపేట
గంట్యాడ మండలం	మదనాపురం
కొత్తవలస మండలం	అర్ధానపాలెం
గజపతినగరం మండలం	మరుపల్లి
మెంటాడ మండలం	పెదమేడపల్లి
వేపాడమండలం	బక్కునాయుడుపేట
తెర్లాం మండలం	పెరుమాళి
ఎల్.కోట మండలం	ఎల్‌కోట
సాలూరు మండలం	పురోహితునివలస
మక్కువ మండలం	మునక్కాయలవలస
కురుపాం మండలం	కురుపాం
మోడల్‌పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.	

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ఇంగ్లీష్‌మీడియంలో ఉత్తమబోధన అందించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఈ పాఠశాలల్లో అందుబాటులో ఉంటారు. క్రమశిక్షణ, ఉన్నతమైన విలువలతో కూడిన విద్యను బోధించేందుకు ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఉత్తమ ప్రతిభ, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయి. అర్హులు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మాణిక్యంనాయుడు, డీఈఓ, విజయనగరం

మహిళా పోలీస్ సిబ్బందికి యోగా శిక్షణ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్‌లో గల పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ శాఖ యోగ శిక్షణను ఆదివారం అందజేసింది. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా యోగా తరగతులను నిర్వహించారు. యోగా అనేది శరీరానికి, మనసుకు, ఆత్మకు శాంతి కలిగించే ప్రాచీనమైన సాధన అని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా అన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలను, ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ, హార్మోనల్ సవాళ్లను ఎదుర్కొంటారని, వాటిని అధిగమించడానికి యోగసాధన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యోగాతో హార్మోనుల సమతుల్యత సాధించి థైరాయిడ్, ఇతర అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చునన్నారు. యోగాతో మహిళల్లో సహనశక్తి పెరుగుతుందని, ఆందోళన, ఒత్తిడి, నిద్ర సమస్యలు తగ్గి, మానసిక ప్రశాంతత పొందవచ్చునన్నారు. నిరంతరం యోగ సాధన చేయడం వల్ల మహిళల్లో ఆలోచన శక్తి, ఏకాగ్రత పెరిగి, పనుల్లో మంచినిర్ణయాలు తీసుకుంటూ, జీవితంలో సమర్థవంతమైన వ్యక్తులుగా రాణిస్తారని అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడంతో శారీరక, మానసిక ఆనందాన్ని పొందవచ్చునని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఈ.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ యోగా శిక్షణ తరగతుల్లో ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, ఎస్సైలు పద్మావతి, నరసింగరావు, ఎఆర్ ఎస్సై కె.రమేష్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు సొంతం చేసుకోవాలి

- మహిళల ఆరోగ్యం కోసం వికాస్ తరంగణి సేవా సంస్థ
- చినజియర్ స్వామి



మాట్లాడుతున్న చిన్న జియర్ స్వామి

చీపురుపల్లి: ప్రస్తుత సమాజంలో చిన్న వయస్సు నుంచే పెద్దల దగ్గర నుంచి సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడమే కాకుండా సొంతం చేసుకోవాలని వేద గురువు, ఉపదేశకుడు చిన్న జియర్ స్వామి బోధించారు. ఈ మేరకు ఆదివారం చీపురుపల్లిలోని ప్రముఖ వ్యాపారులు అంధవరపు హరి, గోవింద నివాసంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక రాధామాధవ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పూర్వీకులు పాటించిన సంప్రదాయాలు ప్రతి వ్యక్తి జీవితంపైనా ఎంతో ప్రభావం చూపుతాయన్నారు. పూర్వ సంప్రదాయాలకు ఎంతో గొప్ప విలువ ఉందని అందుకనే పూర్వీకులు పాటించారని తెలిపారు. ప్రస్తుతం ఆ సంప్రదాయాలు తెలియక పిల్లలు తప్పులు చేస్తున్నారని అలాంటప్పుడు పిల్లలను కాకుండా సంప్రదాయాలు నేర్పని తల్లిదండ్రులనే దండించాలని అభిప్రాయ పడ్డారు. సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ మంచిని కోరుకోవాలని అప్పుడే ప్రతి కుటుంబం బాగుంటుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలని లేదంటే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని సూచించారు. న్నారు. ఇటీవల కాలంలో మహిళలను క్యాన్సర్ మహమ్మారి వెంటాడుతోందని, అందుకనే వికాస్ తరంగిణి సేవా సంస్థను 2007లో నెలకొల్పి ఇంతవరకు 30 లక్షల మంది మహిళలకు ఉచితంగా వైద్య సహాయం, అవగాహన కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వికాస్ తరంగిణి సేవా సంస్థకు వలంటీర్లు ఉన్నారని చెప్పారు. మహిళలు అప్రమత్తమై వికాస్ తరంగిణి సేవా సంస్థను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మనిషికి వినికిడి ప్రధానం

- 5 నుంచి 10 శాతం మందికి పుట్టుకతో వినికిడి సమస్య
- 10 రోజులు వెంటిలేటర్‌పై చికిత్స తీసుకున్న శిశువులకు వినికిడి సమస్య వచ్చే అవకాశం
- త్వరగా గుర్తించకపోతే మూగ, చెవిడు బారిన పడే ప్రమాదం



ఘోషాఆస్పత్రి ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులు

విజయనగరం ఫోర్ట్: మానవుడికి కళ్లు ఎంతటి ప్రాధాన్యమైనవో చెవులు కూడా అంతటి ప్రాధాన్యమైనవే. వినికిడి సమస్య ఉంటే ఎదుటివారు ఏం మాట్లాడుతున్నారో తెలియదు. వినికిడి సమస్యను త్వరగా గుర్తించగలగాలి. లేదంటే చెవుడుతో పాటు మూగ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా శిశువులకు పుట్టకతో వినికిడి సమస్య వచ్చే ఆస్కారం ఉంది. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. ప్రపంచ జనాభాలో 10 శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. భారతదేశం జనాభాలో 5నుంచి 10 శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. జిల్లాకు సంబంధించి 5 నుంచి 10 శాతం వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. అప్పుడే పుట్టిన శిశువులు వారం నుంచి 10 రోజులు వెంటిలేటర్‌పై చికిత్స పొందే పరిస్థితి ఉంటే వినికిడి సమస్య బారిన పడే అవకాశం ఉంది. 40 ఏళ్లు దాటిన వారు కూడా వినికిడి సమస్య బారిన పడే అవకాశం ఉంది.

సమస్యను త్వరగా గుర్తించాలి

నవజాత శిశువుల్లో వినికిడి సమస్యను త్వరతిగతిన గుర్తించాలి. త్వరగా గుర్తించకపోతే మూగ, చెవుడు సమస్యల బారిన పడతారు. ఆదేవిధంగా భాష కూడా అభివృద్ధి చెందదు. పుట్టిన ప్రతి నవజాత శిశువుకు వినికిడి సమస్య ఉందా? లేదా? అని స్క్రీనింగ్ చేయించాలి. స్క్రీనింగ్‌లో వినికిడి సమస్య ఉన్నట్లు అనిపిస్తే, వినికిడి లోపం ఎంత ఉందో తెలుసుకునేందుకు బెరా టెస్టు చేయించాలి.



సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

వినికిడి సమస్యకు కారణాలు:

నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉంది. మేనరికం వివాహం చేసుకునే వారికి పుట్టే శిశువులకు వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉంది. జన్యుపరమైన లోపాల వల్ల, క్రోమోజోముల్లో తేడా వల్ల సౌండ్ పొల్యుషన్ వల్ల వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉంది. అతిగా సెల్‌ఫోన్లు వినియోగించడం వల్ల కూడా వినికిడి సమస్య వచ్చే అవకాశం ఉంది. వినికిడి సమస్యలతో అనేక మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్నారు. వినికిడి మెషీన్‌ల ద్వారా సమస్య కొంతవరకు తీరుతుంది. కొంతమందికి శస్త్రచికిత్సలు చేయడం వల్ల సమస్య తీరుతుంది.

పుట్టిన నెల లోపు శిశువులకు స్క్రీనింగ్ చేయించాలి:




నవజాత శిశువులకు పుట్టిన నెలలోగా వినికిడి సమస్యను తెలుసుకునేందుకు స్క్రీనింగ్ చేయించాలి. పుట్టిన మూడు నెలల లోపు బెరా టెస్టు చేయించాలి. పుట్టిన ఆరు నెలల లోపు ఆపరేషన్ చేయించడం గాని మెషీన్ పెట్టించడం గానీ చేయాలి. అతిగా సెల్ ఫోన్ వినియోగించకూడదు. వినికిడి సమస్యలను ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. నిర్లక్ష్యం చేస్తే వినికిడి సమస్యతో పాటు మాటలు రాని పరిస్థితి వస్తుంది.

డాక్టర్ బి.అజయ్‌కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈఎన్‌టీ విభాగం

ఎక్కడి పనులు అక్కడే ఆపండి..!

- అర్ధాంతరంగా నిలిచిపోయిన పెద్దగెడ్డ పూడికతీత
- పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించిన అధికారులు
- మంత్రి అంగీకారం లేకుండా పనులు చేయవద్దని హుకుం



పెద్దగెడ్డ రిజర్వాయర్



జీగిరాం సమీపంలో ఇటీవల కాంట్రాక్టర్ చేపట్టిన పనులు

సాలూరు: వారంతా నిబంధనల ప్రకారం, కాంట్రాక్టులు దక్కించుకుని పనులు ప్రారంభించారు. నిర్దేశించిన పనులు చేపట్టే క్రమంలో కొద్ది శాతం పనులు పూర్తయిన తరువాత అధికారులు సదరు కాంట్రాక్టర్‌లకు షాకింగ్ వార్త చెప్పారు. ఎక్కడిపనులు అక్కడే ఆపివేయాలని, స్థానిక మంత్రిని కలిసి ఆమె అంగీకారం తెలిపిన తరువాతే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్లు కంగుతున్నారు. ఇది సాలూరు నియోజకవర్గంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ కాలువల పూడికతీత పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల పరిస్థితి. స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ నుంచి పెద్దగెడ్డ సబ్‌డివిజన్ పరిధిలో పూడికతీత పనులు చేపట్టడానికి రూ.91.21 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న కాలువల పూడిక తీత, గోడలు, మదుముల నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఈ పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. నిబంధనల మేరకు పనులను ప్రారంభించారు. ప్రాజెక్టు పరిధిలో 15 పనులకు సంబంధించి టెండర్లు పిలవగా వాటన్నింటి పనులను అధికారుల ఆదేశాల మేరకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు పనులు ప్రారంభించారు. దాదాపు 20 నుంచి 30 శాతం పనులు చేసిన తరువాత కాంట్రాక్టర్‌లకు పెద్దగెడ్డ అధికారుల నుంచి షాకింగ్ వార్త వినాల్సి వచ్చింది. చేస్తున్న పనులు ఎక్కడివక్కడే నిలిపివేయాలని, మీరంతా స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలవాలని ఆమె చేయమంటేనే పనులు పూర్తిచేయాలని లేకుంటే లేదని స్పష్టం చేశారు.

పనులు చేసిన వరకు బిల్లులు చెల్లించండి

దీంతో కంగుతున్న కాంట్రాక్టర్‌లు ఆ పనులను నిలిపివేశారు. పనులు ప్రారంభించకముందే ఏదైనా చెప్పాలని, పనులు చేపట్టిన మధ్య ఇలా చెప్పడం ఏమిటని కాంట్రాక్టర్‌లు వాపోతున్నారు. పలువురు కాంట్రాక్టర్‌లు మంత్రిని కలిసిన తరువాత, నిరాశగా వెనుదిరగడంతో అక్కడ ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు ఎర్త్‌వర్క్ తదితర పనులు చేపట్టామని కావున చేపట్టిన పనుల వరకు బిల్లుల చెల్లింపులు చేయాలని అధికారులను కాంట్రాక్టర్‌లు కోరడం కొసమెరుపు. దీనిపై పెద్దగెడ్డ డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా, ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ, స్థానిక మంత్రిని కలవాలని కాంట్రాక్టర్లకు చెప్పామన్నారు.



పట్టణంలో కాంట్రాక్టర్ చేపట్టిన కాలువ పనులు



మక్కువ బైపాస్ రోడ్డు వద్ద చేపట్టిన కాలువ పనులు

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని, ప్రతీ ఏడాది వలే ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై డీఈఓ, ఎంఈఓలు, హెచ్ఎంలతో ఆయన ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ఇంకా 15 రోజులే గడువు ఉన్నందున విద్యార్థులు బాగా చదివేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల గ్రేడింగ్ ఆధారంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలని అన్నారు. పరీక్షలకు కొద్ది రోజులే సమయం ఉన్నందున తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ రిసోర్సుపర్సన్లతో మోడల్ పాఠాలను తయారీ చేసి ఉత్తమ బోధన చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేసి పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని విద్యా శాఖాధికారులకు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుపతినాయుడు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.